న్నాను. మా తండ్రి లేడు. కుటుంబం గడవడానికి, చదువు ఖర్చు కోసం అని ముందుగా ఈ ప్రయోగం చేప ట్టాను. డబ్బు చాలా వసూలయింది. ఇక చదువు మానేసి ఈ వృత్తిలోకి దిగేను"

"నా గురించి నీకెలా తెలిసింది?"

"పత్రికల్లో గ్రంథస్వీకారం, సమీక్షల్లో మీ పుస్తకాల గురించి, మీ చిరునామా వివరాలు తెలుస్తాయి. నన్ను క్షమించండి సార్" మోహన్‌రావు గద్దించేసరికి మునీర్ గట్టిగా ఏడ్చేశాడు..

"గత సంవత్సరం మీరు పంపిన 300 రూపాయిలు ఇవిగో సార్. నేను అందుకున్న డబ్బును పంపిన వారంద రికీ ఈరోజే ఎం.ఓ చేసి ఎస్.ఐగారికి చూపిస్తాను..ఇంకె ప్పుడూ ఇటువంటి పనులు చేయను"

మోహన్ రాజేశ్వరరావు వైపు తిరిగి "ఇంత చదువుకు న్నావు. కవివి. మా సిస్టర్ సావిత్రి పాటి విచక్షణ తెలియలే దేంరా నీకు?".

తలొంచుకున్నాడు రాజేశ్వరరావు.

**-కొట్టి రామారావు(మచిలీపట్నం)**

# మనశ్శాంతి

**రంగనాధరావు బజార్లో అన్ని పనులూ చూసుకుని, చివ రగా కిరాణాషాపుకి వెళ్ళేడు.**

**"నమస్తేసార్! రండి! కూర్చోండి" చిరునవ్వుతో ఆహ్వానించేడు షాపు యజ మాని.**

తను గత పది సంవత్సరాలుగా ఇదే షాపులో నెలకి సరిపడ సరుకులు తీసుకువె ళ్ళడం అలవాటైపోయింది రంగనాధరావుకి. సరుకు కాస్త నాణ్యంగా వుండడంతోపాటు రేట్లు కాస్త చౌకగా వుండ డంతో ఈ షాపునే ఖరారు చేసేసాడు. "తొందరగా కట్టి స్తారా? నాకు కొంచెం అర్జంటు పనుంది యింటి దగ్గర" స్టూలు మీద కూర్చుంటూ అడిగేడు రంగనాధరావు.

"ఓ తప్పకుండా సార్! ఒరే ఈ సరుకులు తొందరగా కట్టండి" ఆజ్ఞాపించేడు షాపులో కుర్రాళ్ళని.

"సార్! టీ త్రాగుతారా?" మర్యాదకి అడిగేడు షాపు యజమాని రాజయ్య.

"లేదండీ ఇప్పుడే త్రాగి వస్తున్నాను!" నవ్వుతూ సమాధానమిచ్చేడు రంగనాధరావు. ఒక అరగంటలో సరుకులన్నీ రెడీ అయిపోయాయి.

"ఆ! ఎంతయిందో చెబుతారా!" లేచి నిలబడి అడి గేడు రంగనాధరావు. "సార్ మొత్తం ఎనిమిది వందల ఇరవై రూపాయిలయింది" చెప్పాడు రాజయ్య.

"క్రిందటి నెలకన్నా వంద రూపాయిలెక్కువయిందే! అవే సరుకులు" నవ్వుతూ అన్నాడు రంగనాధరావు.

"అన్నీ రేట్లు పెరిగిపోయాయి కదండీ! ఏం చేస్తాం?" సమాధానమిచ్చేడు రాజయ్య.

డబ్బు లెక్కపెట్టి, రాజయ్యకిచ్చేసి రిక్షా కోసం రోడ్డు మీదకు వచ్చేడు. అటే పోతున్న ఒక రిక్షావాడు "సార్! రమ్మన్నారా" అడిగేడు.

"గాంధీనగర్ పార్కు ప్రక్క వీధికి వస్తావా? అదిగో అక్కడ సరుకులున్నాయి" చెప్పాడు రంగనాధరావు.

"పదిహేను రూపాయిలిప్పించండి" అడిగేడు రిక్షా వాడు.

"పదిహేనా? పదిస్తాను. మామూలు రేటే! వస్తే రా!"


"సరే! పన్నెండివ్వండి సార్!" అడిగేడు రిక్షావాడు.

"లేదు! పదికన్న ఇవ్వను నీ ఇష్టం"

"సరే రండి!" సరుకులన్నీ రిక్షాలో పెట్టేడు. పావుగం టలో పార్కు దగ్గరకి తీసుకుపోయి, రంగనాధరావు ఇంటికి తీసుకు వెళ్ళి సరుకులన్నీ ఇంట్లో పెట్టేసేడు. రంగ నాధరావు జేబులోంచి పదినోటు తీసి ఇచ్చేడు.

"ఏంటి సార్! పదిచ్చేరు?" కోపంగా అడిగేడు రిక్షా వాడు.

"పదికేగా నువ్వు ఒప్పుకున్నది!" ఆశ్చర్యంగా అడి



గేడు రంగనాధరావు.

"అదేంటి సార్, పదంటే, నేను పన్నెండు రూపాయి లడిగితే, సరే రా! అన్నారుగా!" దబాయించేడు రిక్షా వాడు.

రంగనాధరావు కోపం కట్టలు త్రెంచుకుంది.

"ఏంటిరా? తమాషాగా వుందా? పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యక వెళ్ళు" అరిచేడు రంగనాధరావు.

"ఎవడ్రా పిచ్చివేషాలేస్తున్నది? రెండు రూపాయి లిచ్చి కదులు!" మీద మీదకొచ్చేడు రిక్షావాడు.

ఇంతలో వీళ్ళ కేకలు విని, ఇరుగు పొరుగు వారంతా బయటికొచ్చేరు. రోడ్డు మీద పోతున్నవారు కూడా మూగి చోద్యం చూస్తున్నారు.

"నేనివ్వను! నీ బాబుతో చెప్పుకో" కోపంతో వూగి పోతూ అరిచేడు రంగనాధరావు.

"పోనీలెండి! ఆ రెండు రూపాయలు పారెయ్యండి. గొడవెందుకు?" భార్య రాధ రంగనాధరావు దగ్గరగా వెళ్ళి చెప్పింది.

అప్పటికే ఇరుగుపొరుగు వారంతా గుమికూడడంతో రాధ మొహం చిన్నబుచ్చుకుంది.

"ఇవ్వవా? రిక్షా ఎక్కేటప్పుడు నీ బాబు సొమ్ములా దర్జాగా ఎక్కి కూర్చున్నావు! ఈ పదీ కూడా నీకాడే వుంచుకో! పిసినారి యెదవా" పదినోటు రంగనాధరావు మొహం మీద విసిరేసి రిక్షా తీసుకుపోతుంటే, రంగనాధ రావు "వెధవా అంటావురా చంపేస్తాను" రిక్షావాడి మీదకి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఇరుగుపొరుగువారు చేసి, రంగనాధరావుని వెనక్కి లాగేసేరు. "ఎందుకు సార్ గొడవ? లోపలికి వెళ్ళిపొండి" అందరూ కలసి రంగనాధ రావుని ఇంట్లోకి పంపించేసేరు. కానీ వెడుతూ వెడుతూ "వెధవ రెండు రూపాయిల కోసం.." అనుకుంటూ నవ్వు కుంటూ వెళ్ళిపోయేరు.

రంగనాధరావు కోపం చల్లారలేదు. "వెధవ! పది రూపాయలకు బేరమాడి.." చేతులు ఇంకా వణుకు తూనే వున్నాయి.

"మీరు ముందు ఇలా కూర్చోండి! కాఫీ ఇస్తాను. ఇంక ఆ గొడవ వదిలెయ్యండి బాబూ!" రాధ అనున యంగా అంది.

ఆ రాత్రంతా రంగనాధరావుకి నిద్ర పట్టలేదు. అందరిలో తనకెంత అవమానం జరిగింది! రిక్షా వాడి మీద కసి ఇంకా తగ్గలేదు. వాడి రూపమే కళ్ళ ముందు వద్దన్నా కదులుతూనే వుంది.

"ఏమండీ! ఇంకా నిద్రపోలేదా? ఇంకా ఆ గొడవే ఆలోచిస్తున్నారా? ఇప్పుడు టైమెంత యిందో తెలుసా? నాలుగు గంటలు" రాధ భర్తకి దగ్గరగా జరుగుతూ ఆప్యాయంగా అంది.

"చూడండి! రెండు రూపాయలకోసం మీ మనశ్శాంతి రాత్రంతా ఎలా పోయిందో! మనశ్శాం తిని కొన్ని వేల రూపాయిలిచ్చినా కొనలేమండీ! అటువంటి వాళ్ళతో సమానంగా దెబ్బలాడి మనం గెలవలేము. వాళ్ళు దేనికైనా తెగిస్తారు. మనమే ఇంతవరకు పరిస్థితి రాకుండా ఆ రెండు రూపా యలు వాడి మొహాన కొట్టుంటే రాత్రంతా హాయిగా నిద్ర పోయేవాళ్ళము కదా! మనశ్శాంతి ఖరీదు వెలకట్టలే మండీ!"

"అవును రాధా! నువ్వు చెప్పింది అక్షరాలా నిజం! ఈ నగ్నసత్యాన్ని నువ్వింత సున్నితంగా చెప్పినందుకు థాంక్యూ!" తను చేసిన చిన్న పొరపాటుకి పశ్చాత్తాపప డుతూ చెప్పేడు రంగనాధరావు.

"అయితే ఇప్పుడేనా కాస్సేపు పడుకోండి హాయిగా! మళ్ళీ ఆఫీసుకెళ్ళాలిగా తొమ్మిది గంటలకే!" నవ్వుతూ దుప్పటి ముసుగేసేసింది రాధ.

**-బి.రాధాకృష్ణమూర్తి (విశాఖపట్నం)**